బుధవారం
18 మార్చి 2026
సంపుటి: 02 సంచిక:357
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

### ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్




2 లో

దళితుల సంక్షేమం

## పట్టని మోడీ సర్కార్

**అరకొర నిధుల్లోనూ 23 శాతం వెనక్కి తీసేసుకున్న వైనం**




న్యూఢిల్లీ : దళితుల సంక్షేమం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోంది. ఎస్‌సిల సంక్షేమం కోసం కేటాయించిన అరకొర నిధుల్లోనూ 23 శాతం నిధులను ఖర్చు చేయకుండా తిరిగి వెనక్కిలాగేసుకుంది. ఈ విషయాలు పార్లమెంటు స్టాండింగ్ కమిటీ తన నివేదికలో వెల్లడించింది. సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఈ నిధులను ఖర్చు చేయాల్సివుంది. కానీ ఖర్చు చేయకుండా ఎందుకు వెనక్కి ఇచ్చేసిందో తమకే 'అర్థం కావడం లేదు' అని స్వయాన బిజెపి ఎంపి పిసి మోహన్ నేతృత్వంలోని కమిటీయే తన నివేదికలో అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది మంత్రిత్వ శాఖ ఆర్థిక అసమర్థత అని పేర్కొంది. కమిటీ నివేదిక ప్రకారం

వివరాలు2లో..

## ఆందోళన వద్దు

**అందుబాటులోకి మరో 24 వేల టన్నుల ఎల్‌పిజి**

**పైప్డ్ గ్యాస్ నెట్‌వర్క్ పెంచేలా చర్యలు- గ్యాస్ సరఫరాపై సిఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి** : రాష్ట్రంలో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా ఎల్‌పిజి నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఎల్‌పిజి నిల్వలు, సరఫరా, సిలెండర్ల పంపిణీ, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కేంద్రం నుంచి ఆయన అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే వున్న నిల్వకు తోడు అదనంగా మరో 24 వేల టన్నుల ఎల్‌పిజి విశాఖలో అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పిజి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవన్నారు. ఇకెవైసి, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్ప కాలికంగా ఉత్పత్తి పెంచటంతో పాటు పంపిణీ మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి గ్యాస్ సిలెండర్ల డెలివరీ సమయాన్ని 1.5 రోజులకు కుదించాలని అన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు చేపట్టాలని సూ చించారు. అలాగే ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయ నం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసే అంశంపై దష్టి పెట్టాలని సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్, పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. పైప్డ్ గ్యాస్ సరఫరాకు సంబంధించి తక్షణం చేయగలమన్న అంశంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్‌తో ఏజీ అండ్

వివరాలు2లో..

## జీడీపీకి చమురు దెబ్బ

**-- 100 డాలర్లు దాటిన క్రూడ్ ధర-- ముదురుతున్న గ్యాస్ సంక్షోభం**




న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్య వాద పోకడలతో పశ్చిమాసియాలో రేపిన చిచ్చు.. భారత ఆర్థిక వ్యవస్థకు సెగ పెడుతోంది. వేల మైళ్ల దూరంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా సాగిస్తోన్న మారణకాండ భారత జీడీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటడంతో పాటు దానికి తోడు దేశంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ కొరత సామాన్యుల వంటగది నుండి భారీ పరిశ్రమల వరకు అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో భారత్ దిగుమతి చేసుకునే ఇంధన సరఫరాకు పెద్ద విఘాతం కలిగింది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మందగించడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ తన ముడి చమురు అవసరాల కోసం 90 శాతం, వంట గ్యాస్ కోసం సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుత సంక్షోభం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించి చమురు ధరల భారాన్ని కొంతవరకు భరించగలిగినప్పటికీ, పారిశ్రామిక రంగంపై పడే దెబ్బ వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌరవ్ కపూర్ విశ్లేషించారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గ్యాస్ కొరత కారణంగా వేలాది ఇంజనీరింగ్ సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ ప్రభావం కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవనోపాధిని కూడా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా దేశంలో వేగంగా పెరుగుతున్న గిగ్

వివరాలు2లో..

## గుజరాత్‌కు నందాదేవి

**46వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో వచ్చిన నౌక**

గాంధీనగర్, మార్చి 17: భారతదేశపు రెండవ ఎల్‌పీజీ రవాణా నౌక 'నందా దేవి' గుజరాత్ ఓడరేవుకు చేరుకుంది. 46,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో 'నందా దేవి' అనే మరో ట్యాంకర్ హోర్ముజ్ జలసంధి మీదుగా గుజరాత్‌కు సురక్షితంగా చేరుకుంది. ఖతార్ నుంచి బయలుదేరి హోర్ముజ్ గుండా ప్రయాణించిన 'నందా దేవి' అనే ఎల్పీజీ ట్యాంకర్, సుమారు 46,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని తీసుకువస్తూ గుజరాత్‌లోని దేవభూమి ద్వారకా జిల్లాలో ఉన్న వడినార్ పోర్టుకు విజయవంతంగా చేరుకుంది. పోర్టులో

వివరాలు2లో..




## ఈ అమ్మాయిలు నిజం కాదు..



**రాత్రివేళ వచ్చే అలాంటి యాడ్స్‌తో జాగ్రత్త: సజ్జనార్**

: మారుతున్న పరిస్థితుల రీత్యా ఒంటరితనానికి అలవాటు పడే యువతను లక్ష్యంగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపో తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు హైదరాబాద్ నగర పోలీసులు ఇందులో భాగంగా "ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా

వివరాలు2లో..

## పాక్ మారణహోమం

**కాబూల్ ఆసుపత్రిపై భీకర దాడులు**

**400 మంది మృతి.. మృతులసంఖ్య పెరిగే అవకాశం కాబుల్‌లో 400 మంది రోగుల మృతి**

**వందలాది మందికి గాయాలు- పాక్ సైనిక దాడిగా అఫ్ఘాన్ ఆరోపణ**

**సైనిక స్థావరాలపైనే దాడి చేశాం: పాకిస్థాన్ ప్రకటన**



కాబుల్, మార్చి 17: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందచేసే దవాఖానపై సోమవారం జరిగిన క్షిపణి దాడిలో వందలాది మంది మరణించారు. పాకిస్థాన్ సైన్యం ఈ దాడికి పాల్పడినట్లు అఫ్ఘాన్ ప్రభుత్వ అధికారులు ఆరోపించగా పాక్ ఖండించింది. మృతుల సంఖ్య ఇప్పటివరకు 400 చేరుకుందని అఫ్ఘాన్ ప్రభుత్వ ఉప అధికార ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ మంగళవారం తెలిపారు. మరో 250 మంది వరకు గాయపడ్డారని ఆయన చెప్పారు. మృతులు, క్షతగాత్రులలో ఎక్కువ మంది దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులేనని ఆయన తెలిపారు. సోమవారం రాత్రి తమ సైన్యం అఫ్ఘాన్ సైనిక, ఉగ్రవాద మద్దతు గల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు పాక్ తెలిపింది. పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపలేదని స్పష్టం

వివరాలు2లో..

నయనతారపై అనుచిత వ్యాఖ్యలు..

## చిక్కుల్లో అన్నాడీఎంకే ఎంపీ



2 లో

## ఫాంహౌస్ కేసుపై సిట్

**డీసీపీ యోగేశ్ గౌతమ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన సర్కారు**

**ఆ పార్టీ వెనుక భారీ బిజినెస్ డీల్?**

**పార్టీ ముసుగులో దుబాయ్ కనెక్షన్లు**

**రోహిత్‌రెడ్డి, నమిత్‌శర్మల కస్టడీకి రంగం సిద్ధం**



2 లో

ఆ మహిళలకు ప్రసూతి

## సెలవును నిరాకరించొద్దు



న్యూఢిల్లీ, మార్చి 17: దత్తత తీసుకున్న బిడ్డ వయస్సుతో సంబంధం లేకుండా, దత్తత తీసుకున్న తల్లికి వేతనంతో కూడిన 12 వారాల ప్రసూతి సెలవుకు అర్హత ఉండాలని సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది.మూడు నెలల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలను దత్తత తీసుకునే మహిళలకు ప్రసూతి సెలవును నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది.దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు, బిడ్డకు గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉందని కూడా కోర్టు గుర్తించింది. దత్తత తీసుకున్న బిడ్డ వయస్సుతో సంబంధం లేకుండా, దత్తత తీసుకున్న తల్లికి 12 వారాల ప్రసూతి సెలవుకు అర్హత ఉండాలని జస్టిస్ పర్దివాలా, జస్టిస్ మహాదేవన్లతో కూడిన ధర్మాసనం

వివరాలు2లో..

తమిళనాట.. ఒంటరి

## పోరుకు విజయ్ సిద్ధం

**ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోని టీవీకే**

**యువత, మహిళల ఓట్లే లక్ష్యంగా ముందుకు**



2 లో

## దళితుల సంక్షేమంపట్టని మోడీ సర్కార్

మొదటి పేజి తరువాయి

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి సంక్షేమ పథకాలు కోసం కేంద్రం రూ. 10,309 కోట్లు మంజారు చేయగా, మంత్రిత్వ శాఖ ఇందులో 23 శాతం అంటే రూ.2,345 కోట్లను మళ్లీ వెనక్కి తిరిగి ఇచ్చేసింది. కేటాయింపుల్లో అధిక భాగాన్ని మంత్రిత్వ శాఖ ఎందుకు వదులుకోవాల్సి వచ్చిందో కమిటీకి అర్థం కావడం లేదని నివేదికలో తెలిపింది. అలాగే, 2024-25లో మంజూరైన బడ్జెట్‌లో గణనీయమైన మొత్తాన్ని కూడా మంత్రిత్వ శాఖ వెనక్కి తిరిగిచ్చేసిన విషయాన్ని కూడా కమిటీ గుర్తించింది. ఎస్‌సి విద్యార్థుల కోసం 'టాప్ క్లాస్ ఎడ్యుకేషన్', ఒబిసిలు, ఇబిసిలు, డినోటిఫైడ్ తెగల విద్యార్థుల కోసం 'టాప్ క్లాస్ స్కూల్ అండ్ కాలేజ్' పథకాలకు కేటాయించిన బడ్జెట్‌లో 20 నుంచి 25 శాతాన్ని మంత్రిత్వ శాఖ వెనక్కి ఇచ్చేసిందని కమిటీ నివేదిక తెలిపింది.ఈ పథకాలకు రాష్ట్రాల నుంచి తక్కువ స్థాయిలో ప్రతిపాదనలు వచ్చాయని మంత్రిత్వ శాఖ చెప్పిన సమాధానం నమ్మశక్యంగా లేదని కూడా నివేదిక పేర్కొంది. మంజూరు చేసిన నిధుల్ని, కేటాయించిన బడ్జెట్‌ను మంత్రిత్వ శాఖ తిరిగిపంపడం, ఖర్చుచేయలేకపోవడాన్ని గమనించడం కమిటీకి అసంతృప్తి కలిగిస్తోందని నివేదిక పేర్కొంది. అలాగే, మైనార్టీల సంక్షేమ పథకాల్లో కొనసాగుతున్న బడ్జెట్ కోతలు, నిధుల దుర్వినియోగం, అమల్లో ఉన్న లోపాలపై కూడా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా మైనార్టీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ప్రీ-మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలకు 2012-22 తరువాత ఆమోదం లభించలేదని, తీవ్రమైన అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో 2022-23 నుంచి స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేయలేదని కూడా కమిటీ తెలిపింది. అయితే అవకతవకలు తక్కువగానూ, అస్సలు జరగని రాష్ట్రాల్లోనూ ఈ పథకాలను అమలు చేయడం ద్వారా మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్ నిధులకు దూరం కాకుండా చూడాలని కమిటీ మంత్రిత్వ శాఖకు సూచించింది.

## ఆందోళన వద్దు

మొదటి పేజి తరువాయి

పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ లు సహజ వాయువును సరఫరా చేస్తున్నాయని వివ రించారు. 198 సీఎన్‌జి స్టేషన్ల ద్వారా ఈ సర ఫరా జరుగుతోందని తెలిపారు. 1.68 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఇచ్చేలా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నా యని తెలియచేశారు. దీనిపై స్పందించిన ఆ నెట్‌వర్క్‌లను మరింత విస్తతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

త్వరలో ఏపి వన్ యాప్

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులను సెన్సిటైజ్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సిటిజన్ సేఫ్టీ అవేర్‌నెస్‌లో వారికి సంక్షిప్త సమాచారాన్ని పంపించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు లింక్‌ను యాప్ ద్వారా లేదా వాట్సప్ గవర్నెన్సు ద్వారా వినియోగదారులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికి సంబంధించి రూపొందిస్తున్న ఏపీ వన్ యాప్‌ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కష్ణబాబు, పంచాయితీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, సురేశ్ కుమార్, దేవాదాయశాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, వివిధ పెట్రోలియం కంపెనీలు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇరాన్ సెక్యూరిటీ చీఫ్
## లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్

ఇరాన్: ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీ ని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. లారిజానీని లక్ష్యంగా చేసుకుని టెహ్రాన్‌లో వైమానిక దాడులు జరిపినట్లు అంతకుముందు ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ఇతర దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన బాసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ గోలమ్‌రెజా సోలేమాని హతమైనట్టు వెల్లడించారు. ఈ ఘటనలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదఇటీవల మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి లారిజానీ కుడిభుజంగా వ్యవహరించారు. దేశ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమం తదితర వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. 'సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ది కల్చరల్ రివల్యూషన్'లోనూ సభ్యుడిగా ఉన్నారు. అలీ ఖమేనీ మరణానంతరం లారిజానీని ఇరాన్‌లో శక్తిమంతమైన నేతగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు.. సోలేమాని నేతృత్వంలోని బాసిజ్ దళాలు ఇరాన్‌లో ప్రజా నిరసనలను ఉక్కుపాదంతో అణచివేశాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆయనపై అమెరికా, ఈయూ ఆంక్షలు విధించాయి'మాకు ఎవరి అవసరం లేదు': మిత్ర దేశాల షాక్ వేళ ట్రంప్ వ్యాఖ్యలుబాసిజ్ డిప్యూటీ కమాండర్, ఇతర ఉన్నతాధికారులను కూడా అంతమొందించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పాలస్తీనా ఇస్లామిక్ నేత అక్రమ్ అల్- అజౌరీ తదితరులపైనా దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో అల్- అజౌరీ మరణించి ఉండొచ్చని పేర్కొంది. గాజా, వెస్ట్ బ్యాంక్ కేంద్రాలుగా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్న వీరు టెహ్రాన్‌లోని ఒక సురక్షిత స్థావరంలో దాక్కుని ఉండగా దాడి చేసినట్లు తెలిపింది.

## జీడీపీకి చమురు దెబ్బ

మొదటి పేజి తరువాయి

ఎకానమీలో భాగమైన లక్షలాది మంది డెలివరీ ఏజెంట్ల ఆదాయం ఇంధన ధరలు, గ్యాస్ కొరత వల్ల సగానికి పైగా పడిపోయింది. మరోవైపు గల్ఫ్ దేశాలకు జరిగే సుమారు 200 బిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. దీనివల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో 92.5 వద్దకు పడిపోయింది. ఒకవైపు వృద్ధి తగ్గుతూ.. మరోవైపు ధరలు పెరుగుతుండటంతో భారత ఆర్థిక వ్యవస్థ ఒక క్లిష్టమైన పరీక్షను ఎదుర్కొంటోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ఫాంహౌస్ కేసుపై సిట్

హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తు న్న మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వం మంగళవారం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో డీసీపీ యోగేష్ గౌతమ్ నేతృత్వంలో మొత్తం 9 మందితో ఏర్పాటు చేసింది. ఈ కేసులో దర్యాప్తును పూర్తి చేసి 3 నెలల్లోగా ఛార్జ్‌షీట్ దాఖ లు చేయాలని ఆదేశాలు జారీ చేసిందిఈ బృందంలో ఎం రవీందర్‌రెడ్డి (గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్), సిహెచ్ సిరిషా (డీసీపీ, షాద్‌నగర్), బుచ్చయ్య (డీఎస్పీ, ఈగల్ ఫోర్స్), హరీష్‌చంద్రరెడ్డి (డీఎస్పీ, ఈగల్ ఫోర్స్), వై మల్లికార్జునరెడ్డి (ఎస్సై, మొయినాబాద్), కోటేశ్వరరావు (మోకి లా పోలీస్ స్టేషన్ ఎస్సై), వెంకన్న (మొయినాబాద్ ఎస్సై), సదాత్ అలీ (శంషాబాద్‌బాద్ ఎస్సై) ఉన్నారు. ఈ క్రమం లో కేవలం మాదకద్రవ్యాల సేవనమే కాకుండా, ఈ పార్టీ వెనుక ఏదైనా భారీ ఆర్థిక లావాదేవీ లేదా బిజినెస్ డీల్ ఉందా అనే కోణంలో సిట్ అధికారులు లోతుగా కూపీ లాగుతున్నారు.గంటలపాటు విచారణ.సిట్ అధికారులు మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ కేంద్రంగా విచారణను ప్రారంభించారు. ఈ కేసులో ఇప్పటికే స్టేషన్ బెయిల్ పొందిన ఎనిమిది మంది నిందితులను పిలిపించి, గంటల తరబడి విడివిడిగా విచారించారు. పార్టీకి సంబంధించిన ప్రతి చిన్న సమాచారాన్ని సేకరిస్తూ, నిందితుల మధ్య ఉన్న అంతర్రాష్ట్ర, అంతర్జాతీ య ఆర్థిక సంబంధాలను వెలికితీసే పనిలో పడ్డారు.బెంగళూరు నుంచి అడ్వకేట్లు, ఢిల్లీ నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపీ, తెలంగాణ నుంచి మాజీ ఎమ్మెల్యే.. ఇలా వివిధ రాష్ట్రాల వ్యక్తులు ఒకే చోట చేరడం వెనుక ఏదో పెద్ద కుట్రే ఉండి ఉంటుందని సిట్ భావిస్తోంది. ఏదైనా వివాదాస్పద సెటిల్మెంట్ లేదా భారీ భూమి లావాదేవీలకు సంబంధించిన చర్చలు జరిగాయా.. అనే అంశంపై సిట్ ఫోకస్ చేసింది. ముఖ్యంగా బెంగళూరు అడ్వకేట్ కౌశిక్ రవి ద్వారా డ్రగ్స్ సరఫరా జరిగినట్లు తేలడంతో, ఆ నెట్వర్క్ ఎక్కడి వరకు విస్తరించిందనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.తెలంగాణ రాజకీయ విశ్లేషణమరోవైపు, కేసులో ప్రధాన నిందితుడు నమిత్ శర్మకు సంబంధించిన దుబాయ్ లింకులపై సిట్ ప్రత్యేక దృష్టి సారించింది. ఢిల్లీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న నమిత్ శర్మకు దుబాయ్ లోని అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఉన్నాయనే పక్కా సమాచారంతో అధికారులు విచారణ సాగిస్తున్నారు. డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చే నల్ల ధనాన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడిగా పెట్టి తెల్లగా మారుస్తున్నారా.. అనే కోణంలో నిందితుల బ్యాంక్ ఖాతాలను, ఐటీ రిటర్న్‌ను అధికారులు జల్లెడ పడుతున్నారుకాల్ డేటా విశ్లేషణలో నిందితుల ఫోన్ల నుంచి విదేశీ నంబర్లకు పలుమార్లు సంభాషణలు జరిగినట్లు తేలడం ఈ అనుమానాలకు బలాన్నిస్తోంది. మంగళవారం జరిగిన విచారణలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఎనిమిది మందిని సిట్ అధికారులు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారుపార్టీకి మిమ్మల్ని ఎవరు ఆహ్వానించారు, అక్కడ డ్రగ్స్ ఉన్న విషయం మీకు ముందే తెలుసా, నిందితుల మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలు ఏమిటి వంటి అంశాలపై వారి నుంచి స్టేట్మెంట్లను రికార్డ్ చేశారు. ప్రస్తుతం చంచల్గూడ జైలులో రిమాండ్లో ఉన్న పైలట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను తమ కస్టడీలోకి తీసుకునేందుకు సిట్ అధికారులు త్వరలోనే కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

## తమిళనాట.. ఒంటరి పోరుకు విజయ్ సిద్ధం

చెన్నై: తమిళనాడులో తమిళగ వెట్రి కళగం(టీవీకే) పేరుతో రాజకీయ పార్టీ పెట్టిన సినీనటుడు విజయ్ ఎన్నికల్లో గెలుపు ధీమాతో ముందుకెళ్తున్నారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా బరిలోకి దిగుతున్నారు. బలమైన డీఎంకే, అన్నాడీఎంకే కూటములతో పోరుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో అవినీతిరహిత పాలన అందిస్తామని ప్రకటిస్తున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ప్రభావం గట్టిగా ఉండబోతుందని, ద్రావిడ పార్టీల ఓటు బ్యాంకును కొల్లగొట్టే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకుల అంచనయువతలో క్రేజ్..తమిళనాట ఇప్పటి వరకు ఉన్న పార్టీలు సామాజిక వర్గాలను నమ్ముకొని పావులు కదిపాయి. విజయ్ అవేవీ పట్టించుకోకుండా యువత, మహిళల ఓట్లపై దృష్టిపెట్టారు. ఆయన ఉపన్యాసాలకు, హామీలకూ 25 ఏళ్లలోపు వారు ఎక్కువ ఆకర్షితులవడం కలిసొచ్చే విషయం. మహిళలకూ ఏకంగా 13 హామీలిచ్చారు. ముఖ్యంగా ఏడాదికి 6 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, నెలవారీ సాయంగా రూ.2,500, అన్ని ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పిల్లల్ని చదివిస్తే ఏటా రూ.15 వేలు, యువతుల పెళ్లికి 8 గ్రాముల బంగారం, చీర ఇచ్చే పథకాలను తీసుకొస్తామని ప్రకటించారు.లౌకికవాద సిద్ధాంతాలు కాపాడుతా. రాష్ట్రంలో డీఎంకే అవినీతి మితిమీరిందని విజయ్ పలుమార్లు విమర్శించారు. రెండు ప్రధాన కూటములకు ప్రత్యామ్నాయం తానేనని ప్రకటించారు. తమిళనాడులో ద్రావిడ విధానాలకే ఓటర్లు మొగ్గుచూపుతారని గుర్తించి పెరియార్, అంబేడ్కర్, కామరాజర్ భావజాలాలతో తన పార్టీ నడుస్తోందని ప్రతి సభలోనూ చెబుతున్నారు. ద్వి భాషా విధానానికే మొగ్గుచూపారు. లౌకికవాద సిద్ధాంతాల్ని కాపాడతానని హామీ ఇచ్చారు. అభిమానులే అండవిజయ్‌కి ప్రత్యక్ష రాజకీయ అనుభవం లేకపోవచ్చు కానీ. విజయ్ మక్కల్ ఇయక్కం పేరుతో ఫ్యాన్ క్లబ్‌ల ఏర్పాటు.. స్థానిక ఎన్నికల్లో పోటీకి నిలిచిన అనుభవం కేడర్‌కు ఉంది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎంతోమంది అభిమానుల్ని కూడగట్టుకున్నారు. ఆ అండతోనే ఇప్పటికే 70 వేల మంది బూత్ ఏజెంట్లను నియమించారు. వీరితో 1.5 కోట్ల సభ్యత్వ నమోదు చేయించారు. ఈ ఉత్సాహమే గతేడాది నిర్వహించిన సభలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేలా చేసిందిసమస్యలు అనేకంవిజయ్ రాజకీయాల్లోకి వచ్చాక ప్రతికూల పరిస్థితులు చాలా ఎదురవుతున్నాయి. తాజాగా విడాకుల సమస్యతో కోర్టుకెక్కడం, ఓ నటితో సన్నిహితంగా ఉన్నారనే ఆరోపణలు వచ్చాయి. గతేడాది కరూర్ తొక్కిసలాట ఘటనతోనూ చిక్కుల్లో పడ్డారు. బాధిత కుటుంబాల్ని నేరుగా కలవకుండా, పిలిపించుకొని పరిహారం ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి. అధికారంలో భాగస్వామ్యం ఇస్తామని విజయ్ ప్రకటించినప్పటికీ.. ఆయన చుట్టూ అల్లుకున్న ప్రతికూల పరిస్థితులతో ఎవరూ ఇష్టపడటంలేదనే అపవాదూ ఉంది. మరోవైపు జాతీయ పార్టీలకు ఆయన 'బీ-టీమ్' అనే విమర్శలు ఉన్నాయి. ఇవేకాక.. ఎమ్మెల్యేలుగా గెలిచేంత ఓట్లు తెచ్చుకునే పరపతి క్యాడర్‌కు ఉందా? అనేది ప్రధాన ప్రశ్న.

## నయనతారపై అనుచిత వ్యాఖ్యలు.. చిక్కుల్లో అన్నాడీఎంకే ఎంపీ

: ప్రముఖ నటి నయనతార పై తమిళనాడు ఎంపీ ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎంకే స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. ఆమె ప్రస్తావన తెచ్చి, వివాదంలో చిక్కుకున్నారు. అది కూడా.. మహిళల భద్రతకోసం నిర్వహించిన నిరసనలో పాల్గొని ఆయన మాట్లాడిన మాటలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం విల్లుపురంలో ఎన్డీయే కూటమి ఈ నిరసన కార్యక్రమం నిర్వహించింది"మీ కలలను మాకు చెప్పండి.. వాటిని నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది" అంటూ ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. దీనిని ఉద్దేశించి అన్నాడీఎంకే నేత, రాజ్యసభ ఎంపీ సీవీ షణ్ముగం మాట్లాడుతూ.."అబ్దుల్ కలాం మనల్ని కలలు కనమన్నారు. మన కలలను తనతో పంచుకోమని ఆయన (స్టాలిన్‌ను ఉద్దేశించి) అడుగుతున్నారు. నాకు నయనతార కావాలని అడిగితే.. ఆయన నెరవేరుస్తారా..? ఆమెను పెళ్లి చేసుకోవాలనే కల ఎవరికైనా ఉంటే తీరుస్తారా..?" అంటూ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి."మా విధానాలను విమర్శించండి. కానీ, మహిళల గురించి అనుచితంగా మాట్లాడకండి. నయనతారను అవమానించడం ద్వారా మహిళలందరినీ అవమానించారు. ఈ వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని డీఎంకే (ఐఏఖ) పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆ ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. షణ్ముగం అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటి సారి కాదు. గతంలోనూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మహిళల ప్రస్తావన తెచ్చి తీవ్ర విమర్శల పాలయ్యారు.

### శ్రీ నూకాలమ్మవారి 68వ వార్షిక
## జాతర మహోత్సవంలో సిరమ్మ

**ప్రజాస్వామ్యం / విజయనగరం:**

17మార్చి 2026: విజయనగరం లోని పాత పశువుల మార్కెట్ దగ్గర మంగళ వీధిలో కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి 68వ వార్షిక జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్‌ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త గా!! శ్రీ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) గారి కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ మంగళవారం ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఈ అమ్మవారి జాతరలో పాల్గొన్న సిరమ్మ గారికి నూకాలమ్మ వారి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ నూకాళామ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు అనంతరం పండితుల ఆశీర్వాదం పొందారు తదనంతరం కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రసాదంను తాను స్వయంగా భక్తులకు వితరణ చేశారుఈ





సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలిగి ఉండాలని ఆమె కోరారు. ఉత్సవ కమిటీలు ఇటువంటి కార్యక్రమాలు చేయడంవలన ప్రజల్లో భక్తి భావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో 25 వ డివిజన్ కార్పొరేటర్ యడ్ల రాజేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్య కర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాక్ మారణహోమం

మొదటి పేజి తరువాయి

చేసిందాడి జరిగిన సమయంలో ఒమిద్ ప్రభుత్వ దవాఖానలో దాదాపు 3,000 మంది రోగులు ఉన్నట్లు తాలిబన్ ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. బాంబు దాడికి శిథిలమైన భవనంలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్న వీడియో ఫుటేజీని స్థానిక టీవీ స్టేషన్లు ప్రసారం చేశాయి. మొత్తం దవాఖాన ప్రాంగణమంతా మంటల్లో చిక్కుకుందని దవాఖాన సెక్యూరిటీ గార్డ్ చెప్పాడు. దవాఖానకు చెందిన సిబ్బంది వసతి గృహంలో మొత్తం 25 మంది ఉండగా తాను ఒక్కడినే ప్రాణాలతో బయటపడినట్లు అతను చెప్పాడు. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో దవాఖాన వద్దకు సైన్యం చేరుకుందని, ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఓ యుద్ధ విమానంపై యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్లు కాల్పులు జరపగా ఆ జెట్ నుంచి దవాఖానపై బాంబులు పడ్డాయని మిద్ స్టానిక్‌జై అనే మరో సెక్యూరిటీ గార్డు తెలిపాడుబాంబుల దాడిలో దవాఖాన భవనం కుప్పకూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొగచూరిన మొండి గోడలు, గుట్టలుగా భవన శిథిలాలు అక్కడ దర్శనమిస్తున్నాయి.పాకిస్థాన్‌తో తమ ఉమ్మడి సరిహద్దు వద్ద కాల్పులు జరిగి తమ పౌరులు నలుగురు మరణించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరిగినట్లు అఫ్ఘాన్ అధికారులు తెలిపారు. గత కొన్ని రోజుల్లో కాబుల్‌పై పాక్ క్షిపణి దాడులు జరపడం ఇది మూడవసారి. కాగా, సోమవారం రాత్రి అఫ్ఘాన్‌లోని సైనిక స్థావరాలు, ఉగ్రవాద మద్దతు గల సవుపియితపైనే దాడులు నిర్వహించినట్లు పాక్ సమాచార శాఖ ఎక్స్ పోస్టులో స్పష్టం చేసింది. వాస్తవాలను వక్రీకరించి మనోభావాలను రెచ్చగొట్టేందుకే డ్రగ్స్ బాధితుల పునరావాస కేంద్రంపై దాడి జరిగినట్లు అఫ్ఘాన్ చెప్తున్నదని పాక్ ఆరోపించింది. సీమాంతర ఉగ్రవాదానికి తాను ఇస్తున్న మద్దతును సమర్థించుకునేందుకు అఫ్ఘాన్ ఈ చర్యకు పాల్పడినట్లు కూడా పాక్ ఆరోపించింది. కాబుల్‌లోని దవాఖానపై దాడిని భారత ప్రభుత్వం ఖండించింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తం చేసింది. ఇది పిరికి పంద, అమానుష చర్య అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

### ఆ మహిళలకు ప్రసూతి
## సెలవును నిరాకరించొద్దు

మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసింది.'తల్లి జీవితంలోకి బిడ్డ ఏ విధంగా వస్తుందనే దానిని బట్టి మాతృత్వ రక్షణ ఉద్దేశ్యం మారదు. మూడు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళలతో, పెద్ద వయస్సు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళల పరిస్థితి కూడా సమానమే," అని సుప్రీంకోర్టు పేర్కొంది.

## ఈ అమ్మాయిలు నిజం కాదు..

మొదటి పేజి తరువాయి

మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు" అంటూ యువతను ఆకర్షించే రీతిలో సోషల్ మీడియాలో వస్తోన్న యాడ్స్‌పై ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. అయితే, దీని వెనుక ఉన్నది తీయని మాటలు కాదు.. నిలువునా దోపిడీ చేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ (ఎజ ఝుయియిఝుతీ) హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వీడియో కాల్ చేశారో.. అంతే!"యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలే. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయి. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేశారో.. ఇక అంతే. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ దీంతో పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయంమోసపూరిత ప్రకటనలపై కఠిన చర్యలుయూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు అవ్వరు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువును దెబ్బతీసే భారీ కుట్ర దాగి ఉందని తెలుసుకోండి. క్షణికావేశంలో గుర్తు తెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాత్రి వేళల్లోనే ఈ తరహా యాడ్స్ దర్శనమిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి.

## గుజరాత్‌కు నందాదేవి

మొదటి పేజి తరువాయి

అన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.సోమవారం ముంద్రా పోర్టుకు చేరుకున్న మరో ఎల్‌ఫీజీ ట్యాంకర్ తర్వాత ఇది వచ్చింది. ఈ రెండు సరుకుల రాకతో జాతీయ గ్యాస్ నిల్వలు గణనీయంగా బలపడతాయి. ప్రస్తుతం గ్యాస్ సరఫరా గొలుసులో ఎలాంటి కొరత లేదని అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు.దీన్‌దయాల్ పోర్ట్ అథారిటీ చైర్మన్ సుశీల్ కుమార్ సింగ్ మంగళవారం వడినార్‌లో ఒక భారీ నౌక నుంచి నౌకకు ఎల్‌పీజీ బదిలీ కార్యకలాపం ప్రారంభమైనట్లు ప్రకటించారు46,500 టన్నుల ఎల్‌పీజీతో 'నందా దేవి' మాతృ నౌక చేరుకుందని, దీనిని ఎన్నూర్, హల్దియాకు చేరవేయడం కోసం చిన్న నౌకలకు బదిలీ చేయనున్నారని సింగ్ తెలిపారు. పశ్చిమ ఆసియా సంఘర్షణల మధ్య హోర్ముజ్ జలసంధిని దాటి వచ్చిన భారతదేశపు రెండవ ఎల్‌పీజీ క్యారియర్ 'నందా దేవి', 46,500 మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో గేపోర్టుకు సురక్షితంగా చేరుకుందని ఒక అధికారి తెలిపారు.'శివాలిక్' అనే తొలి నౌక సోమవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది.

# ప్రతి రైతుకూ అండగా ప్రభుత్వం

**గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యం**
**పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు**
**రైతన్నా మీకోసంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి**

**ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 17 :**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి రైతుకూ అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు గిరిజన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపొందుతుందని తెలిపారు. పాచిపెంట మండలం కర్రివలస పంచాయతీ పరిధిలోని అమ్మవలస గ్రామంలో రైతన్నా మీకోసం – మెగా పాడి పశువుల పంపిణీ కార్యక్రమం ఐటీడిఎ, వ్యవసాయ – పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి 650 నాటుకోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు అయ్యాయని, ఒక్కో మండలానికి (పాచిపెంట, సాలూరు, మెంటాడ) దాదాపు 200 యూనిట్ల వరకు వచ్చాయని తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగడానికి, పిల్లలను బాగా చదివించుకోవడానికి ఈ పథకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గిరిజన పిల్లలు హాస్టళ్లలో ఉండి చదువు కోవడానికి పునాది వేసింది నందమూరి తారక రామారావు అని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులే టీచర్లుగా ఉండాలని నిర్ణయం తీసుకోవడం వల్ల నేడు అనేక మంది స్థానికులు ఉద్యోగాల్లో ఉన్నారని గుర్తు చేశారు. మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ (ఏడాదికి మూడు) గురించి ప్రస్తావించారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు 20,000 రూపాయల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఇంటింటికీ



పింఛన్ల పంపిణీ సాఫీగా జరుగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా 4000 నుండి 15,000 రూపాయల వరకు వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయని వివరించారు. మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం అమలులో ఉందని, ఇది వారి ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని చెప్పారు. రేపటి నుండి దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని ప్రకటించారు. దివ్యాంగులు తమ సర్టిఫికెట్ లేదా కార్డు చూపిస్తే ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. మొత్తంగా, ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, మహిళల భద్రత మరియు రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఐటీడిఎ – ట్రైకార్ ద్వారా గిరిజనులకు పాడి పశువులను నేడు పంపిణీ చేసుకుంటున్నామన్నారు. సుమారు రూ.5.86 కోట్ల వ్యయంతో మొత్తం 451 యూనిట్లు గల 902 పశువులను పంపిణీ చేసుకున్నట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ ధర రూ.65,000/-లు కాగా, అందులో 75% సబ్సిడీని ప్రభుత్వమే అందజేస్తుందని, మిగిలిన 25% మాత్రమే లబ్ధిదారుడి వాటా అని గుర్తుచేసారు. పశువుల కొనుగోలు ధర రూ.58--60 వేల మధ్య ఉండగా, ప్రతి పశువుకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా మక్కువ 127, పాచిపెంట 109, సాలూరు 68 యూనిట్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో పశువు రోజుకు 8--12 లీటర్ల పాల దిగుబడి రాగా, దీంతో అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పశుసంపదపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 202 దూడలను ప్రదర్శించడం జరిగిందని అన్నారు. 50% సబ్సిడీతో పశువులకు ఆహారం పంపిణీ చేయగా, దీంతో 11,931 మంది పాడి రైతులు లబ్ధిపొందినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 596.55 మెట్రిక్ టన్నుల పశు ఆహారం పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో ఖీవీణ టీకా కార్యక్రమం ప్రారంభం అయిందని, 2.38 లక్షల డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ ద్వారా గ్రామాల వద్దే వైద్య సేవలు అందిస్తారని, పాడి రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేసవిలో పశుసంరక్షణపై సూచనలు చేస్తూ నీరు, నీడ, పోషకాహారం కీలకమన్నారు. పశుసంపద అభివృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు లక్ష్యం కావాలని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం గోకుల షెడ్, క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లు, బ్యానర్లను మంత్రి కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు. పాల క్యాన్లను, పీఎండిఎస్ నవధాన్యాల బస్తాలను, 451 పాడి పశువుల కొనుగోలు కొరకు రూ. 5,86,30,000/-ల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రైతుల నుంచి అందే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా మరియు రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకూ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. పాడి రైతులకు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్. మన్మధరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఏపీఓ పి.మురళీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐటిడిఏ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన నిబంధనల ప్రకారమే క్వారీ నిర్వహణ జరగాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి**




**ప్రజాస్వామ్యం/సీతానగరం, మార్చి 17:**

మండలంలోని నిడగల్లు గ్రామ పరిధిలో రెండు ప్రతిపాదిత క్వారీల నిర్వహణపై మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సలహాలు, సూచనలు మరియు అభ్యంతరాలను ఆయన స్వయంగా స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. క్వారీ నిర్వహణలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మరియు నిర్వాహకులను ఆదేశించారు. క్వారీ వల్ల చుట్టుపక్కల పొలాలకు, గాలికి ఎటువంటి నష్టం కలగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. గ్రామస్థులు లేవనెత్తిన అంశాలను రికార్డు చేశామని, వాటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి మరియు పర్యావరణ కమిటీకి పంపిస్తామని జె.సి తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## సామాన్యుడి జీవితాల్లో గ్యాస్‌మంటలు

**సిలిండర్ల కొరత లేదన్న అధికారుల మాటలు**






ప్రజాస్వామ్యం / గజపతినగరం:

గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని , సిలిండర్ల కొరత లేదని గ్యాస్ యధా తదంగా సరఫరా అవుతుందని జిల్లా అధికారులు చెబుతున్నారు . కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. గ్యాస్ సిలిండర్ అస్సలు బుకింగ్ అవడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు . గ్యాస్ బుకింగ్ కోసం మొబైల్ ఫోన్లో ప్రయత్నం చేస్తే చాలా గంటల పాటు బిజీ వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు . తమకు వచ్చిన సమస్య ఎవరికి చెప్పుకోవాలో, ఎవరిని అడగాలో తెలియక వినియో గదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుకింగ్ కోసం తమ సెల్ ఫోన్ ద్వారా ప్రయత్నిస్తే బుకింగ్ కాల్ దొరకడం లేదని కొందరు , కాల్ కట్ అయిపోతుందని కొందరు వినియోగదారులు అంటున్నారు . కొందరికి బుకింగ్ నెంబర్ దొరికి గ్యాస్ బుక్ అయినా ఓటిపి రావడంలేదని వాపోతున్నారు. మరికొందరికి కొద్దిసేపు ఆగి మళ్లీ ప్రయత్నం చేయండి అంటూ వాయిస్ మెసేజ్ లు వస్తున్నాయి . తర్వాత ఎంత ప్రయత్నించిన ఉపయోగం లేకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ బుక్ కాకపోతే తమ పరిస్థితి ఏమిటంటూ తమ బాధని వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లలో చిన్న చిన్న సాంకేతిక సమస్యల వల్ల బుకింగ్ లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్యాస్ ఏజెన్సీలో చెబుతున్నాయి. సాంకేతిక సమస్యలను అధిగమించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా జరిగే విధంగా చూస్తామని ఏజెన్సీలు అంటున్నాయి. గ్యాస్ బుక్ చేసిన ఐదు రోజుల్లోనే గ్యాస్ సరఫరా జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీనాథ్ చెప్పారు. కానీ గ్యాస్ బుక్ చేసి వారం రోజులు అయినా గ్యాస్ రావడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు .ఈ విషయంపై జిల్లా అధికారులు గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడి సరఫరా పై నిరంతరం పర్యవేక్షణ జరిపి వినియోగదారుల గ్యాస్ కష్టాలను తీర్చవలసిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉంది.

## గృహ అవసర గ్యాస్ సరఫరాపై ఎటువంటి ఆందోళన అవసరం లేదు

**జిల్లా పౌరసరఫరాల అధికారి-జి. మురళీనాథ్**

**ప్రజాస్వామ్యం / విజయనగరం :**

జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి జి. మురళీనాథ్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతానికి సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని ఆయన వివరించారు. ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా జరుగుతున్నదని, ఎక్కడైనా ఆలస్యం లేదా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించవచ్చని తెలిపారుఅత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అవసరమైనప్పుడు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారుప్రజలు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసుకోవడం, అనవసరంగా కొనుగోలు చేయడం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందున అందరికీ సమయానికి గ్యాస్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి సత్యవతి

**ప్రజాస్వామ్యం/పాచిపెంట మార్చి17:**

ఈరోజు పాచిపెంట మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి మరియు మండల వ్యవసాయ అధికారి వారు కర్రివలస రైతు సేవ కేంద్ర పరిధిలో అమ్మ వలస గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జి సత్యవతి గారు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. అలాగే ముఖ్యంగా గిరిజన రైతులు చిరుధాన్యాలు(రాగి, కొర్ర, సామ, గంటెలు) సాగును పెంచాలని కోరారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని పండించి, భూమి యొక్క సారాన్ని పెంచి, అధిక దిగుబడులు మరియు ఆరోగ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాగే రైతులకు ఏపీ ఎయిమ్స్ యాప్ లో రైతు రిజిస్ట్రేషన్ల గురించి వివరించడం జరిగింది. ఆ యాప్ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పండా అనురాధ గారు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీతంలో 'కేప్ ఎలక్ట్రిక్' పూల్ క్యాంపస్ డ్రైవ్

**విజయనగరం (ప్రజాస్వామ్యం)**

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో "కేప్ ఎలక్ట్రిక్ " పూల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు .ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో సీతం ఈసీఈ, ఇఇఇ విద్యార్థులతో పాటు,ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో మొత్తం 30 మంది సీతం కళాశాల విద్యార్థులు మరియు 20 మంది ఎంవీజీఆర్ విద్యార్థులు ఎంపిక అయ్యేరు. వీరికి 3.2 లక్షల వార్షిక ప్యాకేజీ తో ఆఫర్ లెటర్ అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేప్ ఎలక్ట్రిక్ నేషనల్ మేనేజర్ మిస్టర్ గోపి లేఖదేవి దీపక్, మరియు హెచ్.ఆర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మిస్ నందిని ప్రియ హాజరయ్యారు. కేప్ ఎలక్ట్రిక్ అనేది పారిశ్రామిక విద్యుత్ రంగంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఒక ప్రముఖ భారతీయ సంస్థ. ఇది ప్రధానంగా విద్యుత్ రక్షణ వ్యవస్థలు మరియు అత్యాధునిక ఎలక్ట్రికల్ పరిష్కారాలు అందించడంలో ప్రసిద్ధి చెందిందిఈ సందర్భంగా సీతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. 'కేప్ ఎలక్ట్రిక్' వంటి ప్రతిష్టాత్మక సంస్థతో కలిసి ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించడం ఎంతో సంతోషంగా




ఉందని తెలిపారు. మా విద్యార్థులలో ఉన్న సాంకేతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఇది గొప్ప అవకాశమని, కేవలం డిగ్రీ పొందడమే కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ మరియు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారుసీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫోర్త్ ఫేస్ మసీదులో ఇఫ్తార్ విందు

**-సూర్య ఉదయం తెలంగాణ ఎడిటర్ భాషా**



**కూకట్ పల్లి ప్రజాస్వామ్యం మార్చి 17:**

కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ ఫోర్త్ ఫేస్ మస్జిద్ లో సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ వారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగినది. భాష మాట్లాడుతూ ఈ రంజాన్ మాసంలో పదిమందికి భోజనం రూపంలో అలాగే ఎటువంటి దానాలైనా చేస్తే ఆ అల్లా వారికి మంచి ఆరోగ్యమైన మంచి సంపాదన ఎల్లప్పుడూ అలా దీవెనలు ఉంటాయని తెలియజేశారు. ఈ సందర్భంగా మజీద్ కి విచ్చేసిన సుమారు 300 మందికి విందు ఏర్పాటు చేసి ఆ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని ఆ అల్లా ఆశీర్వాదం తీసుకున్నారు ఈ కార్యక్రమంలో మీడియా మిత్రులు అలాగే బంధు స్నేహితులు మసీద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలి

**అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్పష్టీకరణ**



ప్రజాస్వామ్యం/పార్వతీపురం:
జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారులు మరియు భవన నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అటవీ మరియు ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ నుండి ఉన్న అభ్యంతరాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే కాలంలో నిర్మించబోయే రహదారులకు సంబంధించి ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేసి, సర్వే సమయంలోనే అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను డివిజన్ మరియు పనుల వారీగా విశ్లేషించి, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా అటవీ అధికారి జి.ఏ.పి.ప్రసూన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఐటీడీఏ అధికారులు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అటవీ క్షేత్ర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పాసుపుస్తకాల పంపిణీ వేగంగా పూర్తికావాలి

**జిల్లా కలెక్టర్ - ఎస్.రాంసుందర్ రెడ్డి**

ప్రజాస్వామ్యం / విజయనగరం:
జిల్లాలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిలా ్లలోని పరిస్థితులను సి.ఎస్ కు కలెక్టర్ వివరించారుఈ వి.సి అనంతరం కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ప్రతీ నెలా 9వ తేదీలోగా నిర్ధేశించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒక్క



తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని



సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డి.ఆర్.ఓ సి.హెచ్.సత్తిబాబు, ఆర్.డి.ఓ లు వెంకటేశ్వర్రావు, సుధారాణి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## రూ.260 కోట్లతో అభివృద్ధి చేశాం

**అవకాశం ఇచ్చిన ప్రజలందరికీ ధన్యవాదాలు**
**నగర పాలక సంస్థ పాలక వర్గం**



విజయనగరం టౌన్ : అందరి సహకారంతో నగరాన్ని అన్ని రంగాల్లో ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేశామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఈనెల 17తో పాలక వర్గం పాలన కాలం ముగియడంతో నగర పాలక సంస్థ కార్యాలయం లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల వారు మాట్లాడుతూ ఐదేళ్లలో చేసిన కృషిని వివరించారు. కౌన్సిల్ సమయంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు. అప్పటి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు నగరాన్ని సుందరంగా తయారు చేయడం సాధ్యమైందన్నారు. నగరంలో చెరువులు, నగరంలో 11 వాటర్ ట్యాంక్‌లు, 7 కొత్త యుపిహెచ్‌సిల నిర్మాణం చేపట్టా మన్నారు. పార్కులను అభివృద్ధి చేశామన్నారు. పెద్ద చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మహిళా పార్కు, చిల్డ్రన్ పార్కు గంటస్తంభం నూతన మెరుగుదల, నాడు-నేడు నిధులతో పాఠశాలల అభివృద్ధి తమ పాలనలో జరిగాయని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో నగర పాలక సంస్థ డబ్బులు రూ.48 కోట్లు, స్టాంప్ డ్యూటీ డబ్బులు రూ.15కోట్లు ప్రభుత్వం అట్టిపెట్టుకొని ఉంచుకోవడం వలన మరిన్ని అభివృద్ధి పనులు చేయలేకపోయామని అన్నారు. నగరాన్ని అభివృద్ధి చేసే అవకాశాన్ని ఇచ్చిన నగర వాసులకు, పార్టీ నాయకులు, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గ సభ్యులకు సత్కారంనగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివద్ధికి పని చేస్తామన్నారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి,ఫ్లోర్ లీడర్ రాజేష్ తో పాటు కౌన్సిల్ సభ్యులను సత్కరంచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, ఎంఇ ప్రసాదరావు, ఎసిపిలు హరిబాబు, రమణమూర్తి, ఎంహెచ్ఓ సాంబమూర్తి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్‌ను తొలగించాలి



ప్రజాస్వామ్యం/ విజయనగరం
కళంకితుడైన బిఆర్ నాయుడును టిడిడి చైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్‌చేస్తూ వైసిపి ఆధ్వర్యాన మంగళవారం అంబేద్కర్‌జంక్షన్ వద్ద పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిలు మాట్లాడుతూ పవిత్ర పుణ్య క్షేత్రంలో బి ఆర్ నాయుడు లాంటి స్త్రీ లోలుడును చైర్మన్ గా కొనసాగించడం తిరుమల పవిత్రతను దెబ్బ తీయడమేనన్నారు. బిఆర్ నాయుడు తనను లైంగికంగా వేధిస్తున్నారని, అలాంటి వ్యక్తికి ఎలాంటి బాధ్యతలూ ఇవ్వొద్దని, ఒక మహిళ స్వయంగా లేఖ రాసినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. బిఆర్ నాయుడు ఆ సీట్లో కూర్చుంది మొదలు అంతా వివాదాస్పదమేనని అన్నారు. బిఆర్ నాయుడు హయంలో తప్పులు, అపచారాలు, దుస్సంఘటనలు జరుగుతున్నా, చంద్రబాబు కళ్ళు, చెవులు మూసుకున్నారన్నారు. ఒక మహిళతో ఆయన ఉన్న వీడియోలు, ఫోటోలతో అడ్డంగా దొరికినా దీన్ని యావత్ భక్తులు, మహిళా లోకం తప్పుబడుతున్నా, విపక్షాలు ఎత్తి చూపుతున్నా సిఎం చంద్రబాబు మాత్రం చెవులు గట్టిగా మూసుకున్నారని విమర్శించారు. బిఆర్‌నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన చేయడానికి వెళ్లిన మహిళలపైనా, వైసిపి నాయకులపైనా టిడిపి గూండాలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడుల్లో గాయపడ్డ వారిపైనే పోలీస్ లు కేసులు నమోదు చేయడం, పీడీ యాక్ట్‌లు పెట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు. బిఆర్ నాయుడును పదవి నుంచి తొలిగించే వరకు వైసిపి పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.

## పలమనేరులో సైకో వీరంగం

పలమనేరు (చిత్తూరు జిల్లా) : చిత్తూరు జిల్లా గంగవరం మండల కేంద్రంలో మంగళవారం ఓ సైకో వీరంగం సృష్టించాడు. పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని అపహరించాడు. అతివేగంగా ఆ వాహనాన్ని నడుపుతూ మార్గమధ్యంలో ఓ ప్రైవేట్ కారును, ఆటోను ఢీకొన్నాడు. దీంతో, ఆ వాహనాల్లోని వారు గాయాలపాలయ్యారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు సమీపంలోని చెరువులోకి దూకి నీటిలో దాక్కున్నాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువులోకి దిగి నిందితుడిని అదుపులోకి తీసుకుని అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పలమనేరు డిఎస్‌పి దేగల ప్రభాకర్, సిఐ రాంభూపాల్ మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం హెస్సారగట్ట నారసంద్ర గ్రామానికి చెందిన రత్నాధర (36) మద్యానికి బానిసై తరచూ గొడవ పడుతూ ఉండడంతో కుటుంబం అతన్ని దూరం పెట్టిందని తెలిపారు. మద్యంతోపాటు గంజాయికీ అలవాటు పడిన ఆయన తన భార్యను సైతం తీవ్రంగా కొట్టి ఆస్పత్రి పాలు చేసినట్లు తెలిసిందన్నారు.

## నేటి నుండి దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం

**పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులో ఉచితం**
**ప్రజా రవాణాధికారి కె. శ్రీనివాసరావు**

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మార్చి 17:
జిల్లాలో నేటి నుండి దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణాధికారి కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 11.30 గంటలకు సాలూరులో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ విప్ కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి మరియు జిల్లా కలెక్టర్ డా॥ఎన్. ప్రభాకర రెడ్డి చేతుల మీదుగా రావాడ రామభద్రపురంలో, పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర చేతుల మీదుగా ఉచిత బస్సు ప్రయాణం, అలాగే పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయ కృష్ణ దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభిస్తారని వివరించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పీహెచ్ సి పాస్ ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్త్రీ శక్తి పథకం కింద నడిచే ఆర్టిసి బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని వివరించారు. నాన్ స్టాప్ , ఇంటర్ స్టేట్ మరియు అల్ట్రా డీలక్స్ బస్సుల్లో టిక్కెట్ పై 50 శాతం వరకూ రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 164 బస్సులు ఉచిత ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అందులో పల్లెవెలుగు -138 బస్సులు (పార్వతీపురం-50, సాలూరు- 41 మరియు పాలకొండ-47), అల్ట్రా పల్లెవెలుగు - 18



(పార్వతీపురం డిపో -10 మరియు సాలూరు డిపో -8),ఎక్స్ ప్రెస్ బస్సులు -29 (పార్వతీపురం డిపో -8, సాలూరు డిపో - 10 మరియు పాలకొండ డిపో - 11) బస్సులు దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి సిద్ధం చేశామని తెలిపారు.

అర్హతలు
40 శాతం కన్నా ఎక్కువ వికలాంగత కలిగిన వ్యక్తులు, బస్సులో ప్రయాణించేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన పీహెచ్ సి, వికలాంగుల ధృవీకరణ పత్రం (సదరన్) తప్పనిసరిగా ఉండాలి. వికలాంగుడితో పాటు వచ్చే ఒక సహాయకుడికి 50 శాతం వరకు టికెట్ లో రాయితీ కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. దివ్యాంగులు బస్సు ఎక్కినప్పుడు పీహెచ్ సి పాస్, వికలాంగుల కార్డ్ చూపించి జీరో ధర టికెట్ పొందవచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# మూతపడుతున్న హోటళ్లు

**గ్యాస్ కొరతతో చిరు వ్యాపారులు కుదేలు**
**రోడ్డున పడిన వందలాది కుటుంబాలు**
**జనాలకూ తప్పని వంట గ్యాస్ కష్టాలు**




ప్రజాస్వామ్యం/విజయనగరం
పశ్చిమాసియా దేశమైన ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దేశాలు దురాక్రమణ యుద్ధం సాగిస్తున్న నేపథ్యంలో ఆ ప్రభావం దేశం, రాష్ట్రంపైనే కాదు విజయనగరం జిల్లాపైనా పడింది. ప్రధానంగా యుద్ధం ప్రభావంతో జిల్లాలో గ్యాస్ కొరత నెలకొంది. ఫలితంగా హోటల్ రంగం తీవ్రంగా నష్టపోతోంది. ఇప్పటికే జిల్లాలోని వందలాది టిఫిన్ దుకానాలు, టీ స్టాల్స్ మూతపడ్డాయి. యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే దాని ప్రభావం మరిన్ని రంగాలపై పడి ప్రజలు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ ప్రభావం జిల్లాలోని హోటల్ రంగంపై తీవ్రంగా పడింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న హోటళ్లు, టీ స్టాల్స్ మూతపడ్డాయి. దీంతో సుమారు పదివేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారి జీవనం అతలాకుతలం అవుతోంది. మరోవైపు యుద్ధ పరిస్థితులను ఆసరా చేసుకున్న కొన్ని గ్యాస్ ఏజెన్సీలలు కృత్రిమ కొరత సృష్టించి కమర్షియల్, డొమెస్టిక్ సిలిండర్లనే తేడా లేకుండా అందిన కాడికి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి కమర్షియల్ గ్యాస్ నిలుపుదల చేయడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. కమర్షియల్ గ్యాస్ కొన్ని ఏజెన్సీల దగ్గర ఉన్న నిల్వలను ఇప్పటికే చిరు వ్యాపారులకు అందించారు. వారి వద్ద కూడా స్టాక్ లేకపోవడంతో ఆ ప్రభావం హోటల్స్‌పై పడింది. ఈనేపథ్యంలోనే విజయనగరంలో చిరు వ్యాపారాలు సాగించే హోటల్స్, పకోడి, బజ్జీ దుకాణాలు, టిఫిన్ దుకాణాలు, తందూరి పాయింట్లు నాలుగు రోజులుగా ఒక్కొక్కటీ మూతపడడంతో చిరు వ్యాపారులంతా ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాగే యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే పెద్ద హోటల్స్ కూడా మూతపడి వేలాది మంది రోడ్డున పడే ప్రమాదం ఉంది. 10వ తేదీ నుంచి కమర్షియల్ గ్యాస్ రావడం లేదుఈనెల పది నుంచి కమర్షియల్ గ్యాస్ రావడం లేదు. ఉన్న స్టాక్‌నే సర్దుబాటు చేసి అందిస్తున్నాం. మా కస్టమర్లకు గ్యాస్‌ను సరఫరా చేస్తున్నాం. ఇంకా పదిరోజుల వరకు స్టాక్ అందించగలం. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గృహ వినియోగ దారులకు మంగళవారం 525 సిలిండర్లతో లోడ్ వచ్చింది. ఈనెల 12వరకు బుక్ చేసుకున్న వారందరికీ గ్యాస్ అందిస్తున్నాంఎన్. వాసు, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అసిస్టెంట్ మేనేజంవారం రోజుల నుంచి గ్యాస్ దొరకటం లేదుకమర్షియల్ సిలిండర్ దొరక్క కర్రల పొయ్యి మీదే వంటలు చేసి వ్యాపారాన్ని సాగించవలసి వస్తుంది. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుంది ప్రభుత్వం గ్యాస్‌కోసం ఎవరూ ఇబ్బంది పడవద్దు అందుబాటులో ఉందని చెబుతున్నప్పటికీ కమర్షియల్ గ్యాస్ అందుబాటు లేదని చెప్తున్నారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022